క్లుప్తంగా

పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా

సాక్షి ఎఫెక్ట్...



పెదమానాపురం బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు సరఫరా చేసిన గుడ్లు,చిక్కీలు

దత్తిరాజేరు: మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు సంక్రాంతి సెలవులకు ముందు నుంచి కోడిగుడ్లు సరఫరా కాకపోవడంపై సాక్షి పత్రికలో 'పాఠశాలలకు సరఫరా కాని కోడిగుడ్లు' శీర్షికతో శనివారం కథనం ప్రచురితమైంది. దీనికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. మండల వ్యాప్తంగా ప్రాథమికపాఠశాలలకు కోడిగుడ్లతో పాటు చిక్కీలు సరఫరా చేయని ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పాఠశాలలకు వాటిని పంపిణీ చేయించారు.

ఆశ్రమ పాఠశాలకు నిత్యావసరాల వితరణ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాత రమేష్

కొత్తవలస: ఆంజనేయపేట సమీపంలోని చైతన్య దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన పి.వి.రమేష్ తన తల్లిదండ్రులు అప్పారావు, అరుణ జ్ఞాపకార్థం రూ.65,000 విలువైన నిత్యావసర సరుకులు శనివారం అందజేశారు. దాతకు పాఠశాల నిర్వాహకులు భోజంకి సన్యాసిరావు, ప్రిన్సిపాల్ బి.ఎ.నాయుడు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

పశువుల వ్యాన్ సీజ్

బొండపల్లి: మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారి 26పై మానాపురం వైపు నుంచి విజయనగరం వైపు అక్రమంగా పశువులును తరలిస్తుండగా వ్యాన్‌ను బొండపల్లి ఎస్ఐ యు.మహేష్ పట్టుకొని వ్యాన్‌ను శనివారం సాయంత్రం సీజ్ చేసారు. వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 5 పశువులను పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



దత్తి అప్పల నాయుడు(ఫైల్)

దత్తిరాజేరు: విజయనగరం అపెక్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మండలంలోని వంగర గ్రామానికి చెందిన విద్యార్థి దత్తి అప్పల నాయుడు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. విద్యార్థి కుటుంబ సభ్యుడు చిరంజీవి తెలిపిన వివరాలు... విద్యార్థి అప్పల నాయుడు అపెక్స్ కళాశాలలో చదువుకుంటూ నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ వద్ద ఉన్న వసతి గృహంలో ఉంటున్నాడు. గురువారం సాయంత్రం నుంచి విద్యార్థి కనిపించడం లేదని అక్కడ సిబ్బంది కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 94407 34248 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

'జియో' రామకృష్ణకు పురస్కారం



'జియో' రామకృష్ణను సన్మానిస్తున్న అతిథులు

శృంగవరపుకోట: స్థానిక 'జియో' (గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్) వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బిలి రామ కృష్ణకు భారత్ సేవా శ్రేష్ఠ పురస్కారం దక్కింది. విశాఖ ట్రావెల్ ఎండ్ టూరిజం ఫౌండేషన్, టి.వి.టూరిజం ఆరోవారిషికోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో శనివారం నిర్వహించిన కార్య క్రమంలో అవార్డు అందజేశారు.సినీనటుడు ప్రసన్నకుమార్, వాస్తురత్న డాక్టర్ పట్నాయక్ నారాయణమూర్తి, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బీకే రామేశ్వరి, దర్శకుడు మణిభూషణ్, తదితరులు రామకృష్ణను ఘనంగా సన్మానించారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు



పరుగుతీస్తున్న ఎడ్లు

వేపాడ: వల్లంపూడి గ్రామంలో సాంబమూర్తి తీర్థ మహోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో 17 జతల ఎడ్లు పాల్గొనగా...మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు సంబంధించిన యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.అలాగే శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుతులు అందజేశారు.

అతివ.. దరహో..



- జానపద కళల్లో అదరగొడుతున్న మహిళలు
- మగవారికే సాధ్యం అన్న తోటపెద్దు తాళాలు, చిటికెల భజనల్లో ప్రావీణ్యం

శృంగవరపుకోట: 'ముదితల్ నేర్వగ రాని విద్య గలదె..ముద్దారగ నేర్పింపగన్' అన్న రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం మాటలను నిజం చేస్తున్నారు గ్రామీణ ప్రాంత మహిళలు. జనాలను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తే జనపదాలను జనాలకు చేరువచేసే జానపద కళలకు కేరాఫ్ గ్రామాలు. ఒకప్పుడు మగవారికే పరిమితమైన జానపద కళల్లో ఇప్పుడు మహిళలూ రాణిస్తున్నారు. ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో జానపద కళారూపాలకు ఆదరణ కరువైపోతున్న తరుణంలో వాటిని కాపాడాలని అతివలు కంకణం కట్టుకున్నారు.ఒకప్పుడు మగవారు మాత్రమే శారీకంగా ధృడంగా ఉంటారు కనుకు వారు మాత్రమే ప్రదర్శించగలరన్న జానపద కళారూపాలను నేడు అవలీలగా అతి వలు ప్రదర్శిస్తూ ఔరా...అనిపిస్తున్నారు.ఎస్.కోట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మహిళలు కోలాటాల్లో శిక్షణ తీసుకున్నారు. వేపాడ- వల్లంపూడి గ్రామాల్లో మహిళా బృందాలు పురుషులకే సాధ్యం అన్న తోటపెద్దు తాళాలు, చిటికెల భజనల్లో భళా అనిపించుకుంటూ ప్రావీణ్యం సంపా దించి జనంలోకి తీసుకెళ్లి శభాష్ అనిపిస్తున్నారు.

చిటికెల భజనతో చిందులు

ఇప్పటికీ పలు గ్రామాల్లోని రామాలయాల్లో భజన చెట్టును పెట్టి చిటికెల భజన చేస్తూ రామాయణ గాథను పాటలుగా పాడడం రివాజు. గట్టిగా పాట పాడడం, సుమారు ఐదారు గంటలపాటు హోరాహోరీగా సాగే ఈభజనకు శారీరక సమర్థత, ఆరోగ్యం అవసరం. దీంతో ఇప్పటి వరకూ పురుషులే చిటికెల భజన (దాటుభజన) చేయగలరు అన్నదగ్గర నుంచి ఆడోళ్లు మగవాళ్లకేం తక్కువ కాదు అనే స్థాయికి చేర్చారు. వేపాడ-వల్లంపూడి గ్రామాలకు చెందిన మహిళలు ఒక్కో బృందంలో 25మంది చొప్పున శిక్షణ పొంది చిటికెల భజనలో భళా అనిపిస్తున్నారు.



సింహాద్రి అప్పన్న తాళాల భజన చేస్తున్న వేపాడ మహిళలు (ఫైల్)



కోలాటం ఆడుతున్న ఎస్.కోట మండలానికి చెందిన ముషిడిపల్లి గ్రామ మహిళలు(ఫైల్)



చిటికెల భజన చేస్తున్న వల్లంపూడి మహిళలు (ఫైల్)

తాళాల భజనతో తళుకులు

సింహాద్రి అప్పన్న సేవల్లో హరి హరినారాయణ.. ఆదినారాయణ అంటూ మగవారు తాళాలూ వేయడం చూస్తుంటాం. ఇప్పుడు అవే తాళా లను వేపాడ వెలమ కులస్తు లైన మహిళలు 25 మంది సింహాద్రిఅప్పన్న మహిళా సేవా గరిడీగా ఏర్పాటై బొద్దాన దేముడు బాబు వద్ద అప్పన్న చరితం పాటలు నేర్చుకున్నారు. మగవారికి దీటుగా తాళాలు వేస్తూ, పాటలు పాడుతూ, భజనలు చేస్తూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి ఔరా అనిపిస్తున్నారు.

ఊరూరా కోలాట బృందాలు

వేపాడ, ఎస్.కోట, జామి, కొత్తవలస మండల్లాలోని పలు గ్రామాల్లో మహిళల కోలాటం బృందాలున్నాయి. గతంలో సాదా సీదాగా సాగే కోలాటాలకు గ్రామీణ మహిళలు కొత్త సొబగులు అద్దారు. పూర్తిగా సంప్రదాయ వస్త్రధారణతో, ఆహుతులను అలరించేలా, ఆకట్టుకునేలా మెరిసిపోయే చీరకట్టుతో, అలంకారాలతో జానపద గీతాలతో పా టు, సినీగేయాలకు బాణీలు కట్టి కోలాటమాడుతున్నారు. ప్రస్తుతం ఇలా జానపద కళలు నేర్చుకున్న బృందాలను పట్టణాల్లో, గ్రామాల్లో జరిగే తీర్థమహోత్సవాలు, పండగలు, ఆలయాల వార్షికోత్సవాలు, సంబరాలకు ప్రదర్శనకు తీసుకెళ్తున్నారు.

బొత్సను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



నాయకులతో మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, చిత్రంలో మాజీ ఎంపీ బెల్లాన, మాజీ మంత్రి రాంబాబు

చీపురుపల్లిరూరల్(గరివిడి): శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణను చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరక ముడిదాం,గుర్ల మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరై, తిరుగు పయణంలో గరివి డి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బొత్స కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆయనతో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు,మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్,మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బేటీ అయ్యారు. నియోజకవర్గ నాయకులతో ఆయన మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో పరిస్థితులపై ఆరా తీశారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



గజపతినగరం: పిడిశీలలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుష్మ



గంట్యాడ: పెదవేమలిలో సేవలందిస్తున్న వైద్యసిబ్బంది, డాక్టర్ హేమలత

గజపతినగరం: మండలంలోని పిడిశీల గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో శనివారం 104 వైద్యశిబిరం నిర్వహించారు.శిబిరంలో 60 మందికి వైద్యసిబ్బందితో కలిసి వైద్యాధికారి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోండి

గంట్యాడ: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి హేమలత సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పెదవేమలి గ్రామంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న, ఏఎ న్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

28న ఈపీఎఫ్ పెన్షనర్ల జిల్లా సదస్సు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, ఈపెన్షనర్లు

చీపురుపల్లిరూరల్(గరివిడి): జిల్లా కేంద్రంలో విజయనగరంలోని కె.ఎల్.పురం వద్ద ఉన్న ప్రజాసంఘాల కార్యాలయంలో ఈనెల 28న నిర్వహించనున్న ఈపీఎఫ్-95 పెన్షనర్ల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని నియోజకవర్గ సీఐటీయూ నాయకులు, ఈపెన్షనర్లు కోరారు. గరివిడిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అంబల్ల గౌరినాయుడు, జె.విశ్వనాథరాజు మాట్లాడుతూ ఈపీఎ ఫ్-95 పెన్షనర్లు చెల్లించిన కార్పస్‌ఫండ్ లక్షలకోట్లలో ఉందని, దానిమీద వచ్చిన వడ్డీ వేలకోట్ల రూపాయలు ఉంటుందన్నారు. అయితే పెద్ద మొత్తంలో ఫండ్ ఉన్నప్పటికీ ఈపెన్షనర్లకు తక్కువ మొత్తంలో పెన్షన్లు అందిస్తూ మిగిలిన ఫండ్‌ను తిరిగి కార్పస్ ఫండ్‌కు జమ చేస్తున్నారన్నారు. పెన్షన్ పెంపు విషయం పరిశీలనలోనే లేదని, నిధులు లేకపోవడం వల్లే పెంచలేకపోతున్నామంటూ కేంద్ర ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెబుతోందని ఆరోపించారు. డీఏతో కలిపి కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహించనున్న సదస్సుకు ఈ పెన్షనర్లు అంతా హాజరు కావాలని కోరారు. అనంతరం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు.చీపురుపల్లి,గరివిడి,గుర్ల మండలాల సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ

చీపురుపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కల్పిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువతీ,యువకులు సద్విని యోగం చేసుకోవాలని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ సూచించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాకు 87 మంది అభ్యర్థులు హాజరు కాగా డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపో లో ఫార్మసీ, పీపుల్ మ్యాక్స్, తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు 31మంది ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ అధికారి టి.భాస్కర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిశోర్ కుమార్, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ ఎర్రయ్యరామస్వామి

కొత్తవలస: స్థానిక మేజర్ పంచాయతీ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు, అధికారులు, ప్రజలు సహకరించాలని సర్పంచ్ మచ్చ ఎర్రయ్యరామస్వామి కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ బి.శైలజ ఆధ్వర్యంలో సర్పంచ్ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. సర్పంచ్ మాట్లాడుతూ పంచాయ తీ పరిధిలో సుమారు రూ.70లక్షల ఇంటిపన్ను బకాయిలు, కొత్తవలస -విజయనగరం రోడ్డులోని వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలకు సంబంధించి రూ.94,70,032 అద్దె బకాయిలు ఉన్నాయని వివరించారు. దుకాణాల నిర్వాహకులు అద్దె బకాయిలు, ప్రజలు ఇంటి పన్ను త్వరగా చెల్లించాలని కోరారు. 202 కాలనీలో తాగునీటి పథకాలకు మరమ్మతులు చేపడతామని చెప్పారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణకు, కార్మికులకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు టెండర్లు పిలిచేందుకు, గృహ నిర్మాణాలకు సంబంధించి నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేసేందుకు పంచాయతీ పాలక వర్గ సభ్యులు తీర్మానం చేశారు. ఈఓపీఆర్డీ శ్రీదేవి, ఉప సర్పంచ్ మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆదిలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సులభం

- లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేస్తున్న జయప్రకాష్‌నారాయణ

కొత్తవలస: క్యాన్సర్ వ్యాధిని ఆదిలోనే గుర్తిస్తే తక్కువ ఖర్చుతో నయం చేసుకునే అవకాశం ఉంటుందని, గ్రామీణ ప్రాంతంలో గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అతి పెద్ద క్యాన్సర్ ఆస్పత్రిని నిర్వహించడం గొప్ప విషయమని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్‌నారాయణ అన్నారు. మంగళపాలెం గ్రామంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టును ఆయన శనివారం సందర్శించారు. క్యాన్సర్ ఆస్పత్రి, సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కృత్రిమ అవయవాలు అందించి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్న ట్రస్టు చైర్మన్ జగదీష్ బాబును అభినందించారు. పలువురికి స్వయంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, వైద్యులు పాల్గొన్నారు.

చింతపల్లిపేటలో భూరీసర్వే



భూరీసర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

గుర్ల: మండలంలోని చింతపల్లిపేట గ్రామంలో మండల సర్వేయర్ పి.శివ ఆధ్వర్యంలో శనివారం భూరీసర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు ఎన్నోఏళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారానికి రీసర్వే ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా భూరికార్డులను ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. సర్వే సిబ్బంది, స్థానిక నేతలు జమ్ము అప్పలనాయుడు , లెంక సూర్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం కావాలి



పదోతరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ నాగభూషణం

వేపాడ: పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికతో సన్నద్ధం కావాలని ఎంఈఓ నాాగభూషణం సూచించారు. సోంపురం ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించా రు. పదోతరగతి విద్యార్థులను పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు సమయం దగ్గర పడుతోందని, సమయాన్ని వృథా చేయకుండా రోజూ ప్రణాళికతో చదవాలని సూచించారు. పాఠ్యాంశాల్లో ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాల ని చెప్పారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని దిశా నిర్దేశం చేశారు.

ప్రజాస్వామ్యంలో.. ఓటే వజ్రాయుధం

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యా యులు అన్నారు.గజపతిన గరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని తహసీల్దార్ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ అధికారులు, విద్యార్థులు ర్యాలీలు చేయడంతో పాటు మానవహారంగా ఏర్పడ్డారు. ఓటు హక్కును సద్వినియోగిం చుకుంటామని ఓటర్లతో, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యాలయాల్లో విద్యార్థులకు ముగ్గులు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: చీపురుపల్లి మూడురోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



గజపతినగరం: గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ సిటిజన్‌లను సన్మానిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ,తదితరులు



శృంగవరపుకోట: ఎస్.కోటలోని దేవీ జంక్షన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు



బొండపల్లి: మానవహారంగా ఏర్పడిన బొండపల్లి హైస్కూల్ విద్యార్థులు, అధికారులు,ఉపాధ్యాయులు



చీపురుపల్లి: శ్రీనివాస కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ సత్యవాణి



లక్కవరపుకోట: తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు, తదితరులు



గజపతినగరం: పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు, ఉపాధ్యాయ సిబ్బంది



గంట్యాడ: కొఠారుబిల్లి జంక్షన్‌లో ర్యాలీ చేస్తున్న అధికారులు, ఓటర్లు



దత్తిరాజేరు: ముగ్గుల పోటీల్లో విజేతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న తహసీల్దార్ విజయభాస్కర్



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ విజయకుమార్‌పాత్రో



మెరకముడిదాం: మెరకముడిదాంలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ అజూరఫీజాన్, రెవెన్యూ సిబ్బంది



వేపాడ: వేపాడ హైస్కూల్‌లో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు



చీపురుపల్లి: చీపురుపల్లిలో సత్యరామ డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ